మేడిగడ్డ కత్వావాగు వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేశ్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆమనగల్లు, సెప్టెంబర్ 1: ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువులు, వాగులు నీటితో నిండి పొంగి పొర్లుతున్నాయి. మత్స్యకారులు చేపలు పట్టడానికి గానీ, యువకులు ఈతకు వెళ్లరాదని సీఐ ప్రమోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. పురాతన ఇండ్లలో నివాసం ఉండరాదని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావొద్దని ఆయన సూచించారు. ఆమనగల్లు మండలంలోని మేడిగడ్డ తండాలో కత్వవాగు పొంగిపొర్లుతుంటంతో రాకపోకలు బంద్ అయ్యాయి. ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా భద్రత చర్యలు చేపట్టారు.

కూలిన ఇండ్ల పరిశీలన

కూలిన ఇంటిని పరిశీలిస్తున్న
మున్సిపల్ కమిషనర్ వసంత, చైర్మన్ రాంపాల్‌నాయక్

ఆమనగల్లు, సెప్టెంబర్ 1: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆమనగల్లు మున్సిపాలిటీలో ఇండ్లు కూలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, కమిషనర్ వసంత, ఆర్ఐ చెన్నకేశవులతో కలిసి కూలిన ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులు ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని అధికారులు, నాయకులను కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ చెన్నకేశవులు, మున్సిపల్ అధికారులు సత్యనారాయణ, రామకృష్ణ, షర్ఫుద్దీన్, మహబూబ్ ఉన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

మాడ్గుల, సెప్టెంబర్ 1: మండల పరిధిలోని అర్కపల్లి గ్రామంలో కురిసిన వర్షాల నేపథ్యంలో గ్రామానికి చెందిన సీత లింగయ్య ఇల్లు పైకప్పు శనివారం రాత్రి కూలిపోయింది. ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు ధ్వంసమయ్యాయని తెలిపారు. తమ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

అర్కపల్లిలో కూలిపోయిన ఇంటిని
చూపుతున్న బాధితుడు సీత లింగయ్య

చెరువులో పడి వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబర్ 1 : చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఫరూఖ్‌నగర్ మండలంలోని దేవునిపల్లి గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎరుకల శేఖర్(35) ఆదివారం ఉదయం గ్రామశివారులో పల్లం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి చెరువు గుంతలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది చెరువువద్దకు చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి బావ ర్యాగడి బుడ్డయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బలరాం కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య సేవలు
చిరస్మరణీయం

సంతాప సభలో పాల్గొన్న ఏసీపీ రంగస్వామి, నాయకులు

కడ్తాల్, సెప్టెంబర్ 1: మండలంలో దివంగత హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు అన్నారు. మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మల్లయ్య గత నెల 21 గుండెపోటు రావడంతో మరణించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సంతాప సభలో ఏసీపీ రంగస్వామి, సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్‌తోపాటు మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లయ్య చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం షాద్‌నగర్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో మల్లయ్య కుటుంబానికి రూ.3.50 లక్షలు, బీఆర్ఎస్ పార్టీ తరుపున నాయకులు రూ.32 వేలు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్చా నాయక్, నాయకులు జహంగీర్‌అలీ, ఏఎస్ఐలు ప్రసాద్‌జీ, నిరంజన్, సీతారాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం
పేర్ల సవరణకు అవకాశం

నందిగామ, సెప్టెంబర్ 1: క్రాప్‌లోన్ రుణాలు తీసుకున్న రైతుల్లో కొంత మంది ఆధార్ కార్డు, బ్యాంకుల్లో పేరు వేర్వేరుగా ఉండటంతో రుణమాఫీ కాలేదు. పేరు మార్పు వల్ల రుణమాఫీ కాని రైతులు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌తో రుణం తీసుకున్న బ్యాంకులను సంప్రదించాలని, ఈ నెల 7 వరకు అవకాశం ఉందని నందిగామ మండల వ్యవసాయ అధికారి వాణి పేర్కొన్నారు.

తుర్కయాంజల్ : అలుగు పారుతున్న మాసాబ్ చెరువు

కడ్తాల్ : మండల కేంద్రంలో నిండు కుండలా కనిపిస్తున్న దేవరా చెరువు

ఇబ్రహీంపట్నంలో కురుస్తున్న వర్షం

కడ్తాల్ : కడ్తాల్ గ్రామంలో చెరువును పరిశీలిస్తున్న
ఇరిగేషన్ ఏఈ నిఖిల

ఎడతెరిపి లేకుండా..

మొయినాబాద్‌లోని అమ్డాపూర్ గ్రామ సమీపంలోని వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు

షాద్‌నగర్ పట్టణంలోని నిండుకుండలా కనిపిస్తున్న బొబ్బిలి చెరువు

జిల్లాలో కురుస్తున్న వాన

రంగారెడ్డి జిల్లా ఆయా నియోజకవర్గ పరిధిలోని మండల, పట్టణాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్లు ప్రాంతాలు, పలు గ్రామాలు, పట్టణాల కాలనీల్లోకి వర్షపు నీరు చేరింది. ఆదివారం షాబాద్ మండలంలోని నాగరగూడ ఈసీ వాగు ఉధృత్తంగా ప్రవహిస్తుండగా, ఈసీ వాగును చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పరిశీలించారు. విస్తారంగా కురుస్తున్న వానలకు చెరువులు నిండుకుండలా కళకళలాడగా, కొన్ని ప్రాంతాల్లో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరికొన్ని చోట్ల ఇండ్లు కూలిపోగా, సంబంధిత అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి వరద ఉధృతిని సమీక్షించారు.

- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

షాబాద్ : ఉధృతిగా పారుతున్న మీరాపూర్ వాగు

షాబాద్ మండలంలో ఉధృతంగా పారుతున్న మక్తగూడ వాగు

షాబాద్ మండలం చందనవెల్లి పెద్ద చెరువు అలుగు పారుతున్న దృశ్యం

ఇబ్రహీంపట్నంలో దంచికొడుతున్న వాన

చేవెళ్ల రూరల్ : ఆలూరు-తల్లారం రాకపోకలను బంద్ చేసిన పోలీసులు

షాద్‌నగర్‌లోని కాకునూరు గ్రామంలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

తుర్కయాంజాల్: అపిల్ అవెన్యూ కాలనీలో పారుతున్న వరద నీరు

నందిగామ మండలం నర్సప్పగూడ అక్కమ్మ చెరువువాగు వద్ద
రాకపోకలు నిలిపివేసిన సీఐ ప్రసాద్, తహసీల్దార్ రాజేశ్వర్

కడ్తాల్ : మండల కేంద్రంలో మత్తడి దుంకుతున్న గుర్లకుంట

10వ వార్డులో వర్షపునీటిని మున్సిపల్ సిబ్బందితో
తొలగింపజేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకన్న

షాద్‌నగర్‌లోని తొమ్మిదిరేకుల గ్రామంలో
ఉధృతంగా పారుతున్న వాగు

కడ్తాల్ : ముద్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

అపూర్వం ఆత్మీయ సమ్మేళనం

కడ్తాల్, సెప్టెంబర్ 1: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో, పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని ముద్విన్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2006-07 బ్యాచ్‌కు చెందిన 61 మంది విద్యార్థులు ఆదివారం కలుసుకొని ఆటపాటలు, క్విజ్ పోటీలు, డ్యాన్స్‌లతో ఉల్లాసాంగా గడిపారు. సమ్మేళనంలో ఆర్గనైజింగ్ టీమ్ లోకేశ్, చిన్నా, ప్రశాంత్, యాదగిరి, రాజీవ్, ప్రేమలత, రాణి, నాగమణి, మహేశ్, నర్సింహాతోపాటు ధనలక్ష్మి, సృజన, అలివేలు, గురుదేవి, మంజుల, లింగమ్మ, వసంత, అనూష, ఝాన్సీ, సరిత, సత్యం, రామ్‌రెడ్డి, గోపాల్, యాదయ్య, వెంకటేశ్, మహేశ్, భాస్కర్, రాజు, శోభన్, శ్రీనివాస్, బాలు, గణేశ్, వంశీ, కరుణాకార్, శంకర్, వేణు, రమేశ్, మల్లేశ్, కృష్ణ, సుమన్ పాల్గొన్నారు.

మైసిగండిలో..

మాడ్గుల : కడ్తాల్ మండలం మైసిగండిలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం మండలంలోని కలకొండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2008-2009 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సతీశ్, మల్లేశ్‌యాదవ్, శ్రీశైలం, రాఘవేందర్, యాదయ్య, జాఫర్, జానీ, శ్రీకాంత్, బ్రహ్మచారీ, సైదులు, శేఖర్, శ్రీను, చంద్రశేఖర్, తిరుపతయ్య, జగదీశ్, హరీశ్‌రెడ్డి, రాజేందర్, వెంకటేశ్, మహేశ్, చంద్రశేఖర్, శేఖర్, కృష్ణ, మల్లేశ్, కాంత్రికుమార్, విద్యార్థినులు కోటి, సంతోష, వరలక్ష్మి, రజిని, హైమవతి, సైదమ్మ, సైదమ్మ, మమత, వీరమణి, రమణ, సంతోష, సరిత, కళావతి, విశాల, లక్ష్మీదేవి, రమణమ్మ, శ్రీలత, జ్యోత్న, జ్యోతి, లక్ష్మి, కళ పాల్గొన్నారు.

మాడ్గుల : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

విద్యుత్ తీగలు.. పొంచి ఉన్న ప్రమాదం

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 1: షాద్‌నగర్ మున్సిపాలిటీలోని క్రిస్టియన్‌కాలనీలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్ సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులను ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కాలనీలోని విద్యుత్ స్తంభాలు నివాసాలకు పక్కనే ఉండడంతో పాటు విద్యుత్ వైర్లు అతిసమీపంలో ఉన్నాయని, దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అదే విధంగా కాలనీలోని పాఠశాల ఆవరణలో ఉన్న చెట్ల కొమ్మలు పూర్తిగా విద్యుత్‌వైర్ల పైనుంచి ఉన్నాయని, కొమ్మలు విరిగి పండుతుండడంతో నిరంతరం విద్యుత్ సమస్య తలెత్తుతుందని వాపోతున్నారని తెలిపారు. గతంలో అధికారులకు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

అంబేద్కర్ ఆశయసాధనకు కృషి చేయాలి

విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యేలు వివేక్, కాలె యాదయ్య

అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ తదితరులు

షాబాద్, సెప్టెంబర్ 1: అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలని చెన్నూరు, చేవెళ్ల ఎమ్మెల్యేలు వివేక్, కాలె యాదయ్య అన్నారు. ఆదివారం రాత్రి షాబాద్ మండలంలోని మాచన్‌పల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని తెలంగాణ గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని సాయిచంద్, వెన్నెల గద్దర్, బేగరి రాజుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే నేడు అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు మహేందర్‌రెడ్డి, సత్తయ్య, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, రవీందర్, నర్సింహులు, చెన్నయ్య, అంబేద్కర్ సంఘం నాయకులు రాములు, మాణిక్యరెడ్డి, మహేందర్, యాదయ్య, సుమన్, శ్రీను, విఠల్, యువకులు పాల్గొన్నారు.

పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా కల్యాణ మహోత్సవం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 1 : ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఆదివారం భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో పార్వతి పరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సెంట్రల్ కమిటీ సభ్యులు శెట్టి శివకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శెట్టి విశ్వనాథ్, గౌరవ అధ్యక్షుడు ఆనందప్పల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

షాబాద్, సెప్టెంబర్ 1: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ ప్రజాచైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు నర్సింహులు అన్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు 23శాతం నుంచి 42శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. సర్పంచులు, ఎంపీటీసీలకు, జడ్పీటీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్లు తేల్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీసంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి
ఆర్థికసాయం

మంచాల, సెప్టెంబర్ 1: పదో తరగతి వరకు తమతో కలిసి చదువుకొని అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం చేసి అండగా నిలిచారు. మంచాల మండలం లోయపల్లి గ్రామానికి చెందిన కొర్ర రాజూనాయక్ లోయపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 2004-05 విద్యాసంవత్సరంలో పదో తరగతి వరకు చదివారు. తోటి స్నేహితులు వారి వంతు సాయంగా రూ. 1లక్ష రూపాయలను ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు వారు అందజేశారు. కార్యక్రమంలో తోటి స్నేహితులు పాల్గొన్నారు.